# స్వప్నసౌధం

'స్వప్నపెళ్ళి కూతురాయెనె. మా స్వప్న పెళ్ళి కూతురాయెనె.

ఈ పాట రేడియోలో రాలేదు. ఎవరూ అభినయం చేస్తూ స్టేజీమీద పాడలేదు. పెళ్ళి చూపులకు సమాయత్త అవుతున్న స్వప్న తన ప్రతిబింబాన్ని నిలువుటద్దంలో చూసుకుని మురిసిపోయి తనలో తానే పాడుకుంటున్నది.

పెళ్లికొడుకు తనను చూసి మూర్ఛపోవటం ఖాయం అనుకుంది గర్వంగా.

జగన్నాథరావు రెవెన్యూలో పనిచేస్తూ బాగా గడిస్తున్నాడు. అతనికున్న ముగ్గురి పిల్లలలోనూ ఆఖరిది స్వప్న. ఆమె బి.ఏ. పాసైంది.

పెళ్ళి కొడుకు గోపాలరావు ఎం.ఏ. లిటరేచరు చేసి ప్రభుత్వ జూనియరు కాలేజీలో సహాయ లెక్చరరుగా పనిచేస్తున్నాడు. పిల్లాడి ఫోటో వివరాలూ చూసి స్వప్నతో సహా అందరూ సంతోషించారు.

"నాకు కట్నకానుకల మీద ఆశలేదు. అయితే పెళ్ళి కావలసిన ఆడపిల్ల ఉంది. ఆ పిల్ల పెళ్ళి చేయడానికి డబ్బు కావాలి. మీరిచ్చే కట్నం లక్ష రూపాయలూ మా అబ్బాయి మీ అమ్మాయి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేస్తాను. మా పిల్ల పెళ్లికి అవసరం మేరకే వాళ్ళ దగ్గర డబ్బు తీసుకుంటాను" అన్నాడు తను కట్నం ఏ కారణంచేత తీసుకుంటున్నాడో వివరిస్తూ గోపాలరావు తండ్రి శ్రీ రంగనాయకులు.

'అంతా బూటకం. డబ్బంటే చేదా? అతనలా ససేమిరా చేయడు' అనుకుంది స్వప్న.

"ఆ డబ్బు మీకిస్తున్నాం, మీరెలా వాడుకుంటే మాత్రం మాకేమిటి అభ్యంతరం, మా పిల్ల మీ ఇంట్లో సుఖంగా ఉండాలని మాత్రమే మేం కోరుకుంటున్నాం" అన్నాడు జగన్నాథరావు.

మామయ్యగారు ఆనాటి వాగ్దానం ప్రకారం రెట్టింపు అయ్యే పథకంలో లక్ష రూపాయలూ తమ పేర్న బ్యాంకులో వేస్తే స్వప్న ఆశ్చర్యపోయింది. ఇదీ మంచికే జరిగింది. తన తండ్రి తన నిమిత్తం ఇచ్చిన డబ్బు తనకే చేరింది అని సంతోషించింది.

◆ ◆ ◆

అత్తకు కోడలాబడుచులందరికెప్పుడు దెబ్బలాటలే,
ఉత్తమ సాంప్రదాయమున, ఉత్తమవంశమునుండి వచ్చినన్,
పొత్తుగనుండ రెప్పుడును, పూర్వపు శాపమో, ఘోరపాపమో,
..................

అన్నాడో కవి.

స్వప్న ఆ ఇంటికి వచ్చిన తరువాత ప్రశాంత సరోవరంలాంటి ఆ ఇల్లు కల్లోలిత సముద్రంలా మారిపోయింది.

కోడలొచ్చింది తనకు విశ్రాంతి కొద్దిగానైనా లభిస్తుందని అన్నపూర్ణ ఆశపడింది. వయసులో తన కంటే నాలుగైదేళ్ళు పెద్దదైన యువతి వదినగా వచ్చినందుకు లావణ్య ముచ్చటపడింది. అజంతా శిల్పంలాంటి భార్య దొరికినందుకు గోపాలం పొంగిపోయాడు. కాలచక్ర గమనంలో ఈ పరిణామాలు అతిసామాన్యమైనవని శ్రీ రంగనాయకులు అటు సంబరపడనూ లేదు, ఇటు విచారించనూ లేదు.

తన చిన్నతనంనుంచి తన తల్లి అక్కకు చేసే హితబోధలు స్వప్నకు బాగా గుర్తున్నాయి. వైవాహికజీవితం సుఖప్రదం చేసుకోవాలంటే ఆ చిట్కాలు చాలా ఉపయుక్తమనే భావన పెళ్ళికి ముందునుంచే ఆమెకు కలిగింది.

'కట్టుకున్న వ్యక్తి నీకు ప్రధానం కాని మిగతా వారితో నీకేం పని? నీ మొగుడు నీ చెప్పుచేతల్లో ఉండాలి. అతడు సంపాదిస్తున్నది ఎలా ఖర్చు చేస్తున్నాడో నీవో కంట కనిపెట్టి వుంటూ ఆ డబ్బు దుర్వినియోగం కాకుండా చూడాలి. ఇహ అత్తగారూ ఆడబడుచులూ వున్నారే. వాళ్ళు తమ అధికారంకోసం తపించుకుపోతారు. పరాయి ఇంటి నుంచి వచ్చిన పిల్ల తన కొడుకును తనకు కాకుండా చేస్తుందని తల్లి, తమ మధ్య పెరిగిన సోదరుడ్ని ఆ అమ్మాయి బుట్టలో వేసుకుంటుందని ఆడబడుచూ, అలా జరగకుండా ఉండాలని చూస్తారు. నువ్వు నంగనాచిలా అలా వాళ్ళ మాటలకు నాగస్వరం విన్న నాగుపాములా తల ఊపుతూ ఉంటే నీ అధికారం చెల్లదు. నీ పరిస్థితి ఒక బానిసగా మారుతుంది. భర్తను కొంగున కట్టుకో. అప్పుడే నీవారాజ్యానికి సర్వాధికారిణివి కాగలవు.'

తల్లి సరిగ్గా ఆ ముక్కలే అత్తవారింటికి కన్నీటితో సాగనంపుతూ అంది.

"నువ్వు చూస్తూ ఉండమ్మా! నేను నా భర్తను కీలుబొమ్మను చేసి ఆడించకపోతే నేను నీ కూతుర్నే కాదు" అంది దర్పంగా.

◆ ◆ ◆

పరాయి ఇంటి నుంచి వచ్చిన పిల్ల, అక్కడెంతో సుకుమారంగా పెరిగి వుంటుందని అన్నపూర్ణ తొలిదినాల్లో అన్నీ సమయానికి వారికి అమర్చేది. స్వప్న అది తన అధికారంగా భావించేది.

నెలా రెండు నెలలైనా స్వప్నలో ఏ మార్పూ రాలేదు. భర్త ఇంటిలో ఉన్నంతసేపూ అతని వెంట ఉండేది. అతను డ్యూటీకి వెళ్ళిపోగానే టీ.వి. చూస్తూనో పత్రికలు తిరగేస్తూనో కాలం గడిపేది. లావణ్య అంతా గమనిస్తోంది.

"వదినా! ఎంతకాలం ఇంకా రాచమర్యాదలు చేయించుకుంటావు? అమ్మ ఒక్కర్తి వంటింటిలో సతమతమౌతున్నది. ఆమెకు సహాయం చేయాలని లేదా? అసలు తమరెప్పుడైనా వంటింటిముఖంచూసారా?" అంది లావణ్య.

"ఊరుకోవే, ఆ పిల్ల వయసనగా ఎంత? నాలుగురోజులు పోతే బాధ్యతలు తెలిసి వస్తాయి. అయినా రోజూ చేసే పనులేగా నాకు" అంటూ అన్నపూర్ణ కూతుర్నే వారించింది.

ఉన్నట్టుండి ఒకరోజు ఎవరి అనుమతి తీసుకోకుండా డ్రాయింగు రూంలోని టీ.వి.ని తన బెడ్‌రూంలోనికి మార్చింది. కాలేజీనుంచి వచ్చిన లావణ్య ముందుగా కంగారుపడింది. సంగతి తెలుసుకున్న ఆమెకు కోపం వచ్చింది.

"ఏమండీ! హాలులో టీ.వి.ని ఎవరూ చూడనైనా చూడరు. నాకు పక్కమీద పడుక్కుని చూసే అలవాటు చిన్నతనం నుండి ఉంది. అందుకే మన గదిలోనికి మార్చాను. బాగుంది కదూ?" అంటూ భర్తను సంతోషంగా పెనవేసుకుంది స్వప్న. గోపాలరావుకి అది మంచిపని కాదని తెలుసు. కాని భార్యను పల్లెత్తుమాట అనలేకపోయాడు.

లావణ్య అన్నయ్యతో టీ.వి. విషయం అడిగింది.

"లావణ్యా! దీనికి గొడవెందుకు? మన ఇంటిలో టీ.వి. ఎవరెవరు చూస్తున్నారు కనుక. నీకు కాలేజీ, చదువు, టీ.వి. ఎప్పుడైనా చూస్తున్నావా? నాన్నగారు ఇంటికొచ్చినా ఎంతసేపూ ఆఫీసు ఫైళ్ళు ముందేసుకు కూర్చుంటారు. వారికి న్యూస్‌పేపరూ ట్రానిస్టరూ ఉండనే ఉన్నాయి. అమ్మ వీలు దొరికితే అప్పుడప్పుడు చూస్తుందనుకో. మా గదిలోనికి వచ్చి చూస్తే మేం పొమ్మంటామా?" అన్నాడు.

భార్యా దాసుడోయ్ అనుకుంది లావణ్య. "ఎందుకే వాడితో గొడవలు పడతావు. ఇది వాడు తన సంపాదనతో కొనుక్కున్నదని మీ వదినకు తెలిసింది. ఎవరి వస్తువును వారు వాడుకోవడంలో తప్పేముంది. 'మీకు అంతగా టీ.వి. చూడాలంటే ఒక బ్లాక్ అండ్ వైట్ కొనుక్కొని ఆ వంట ఇంటిలో పెట్టుకోండి' అని మీ వదిన అన్నది" అంది అన్నపూర్ణ.

గోపాలరావుకి మొట్టమొదటగా తలనొప్పి వచ్చింది. ఆ వ్యవహారంతో గోపాలరావు

టీ.వి.ని తెచ్చి యథాస్థానంలో వుంచాడు. స్వప్న కోపంతో భగభగమంది. అన్నపూర్ణే చివరకు కల్పించుకుని కుమారుడికి నచ్చచెప్పి టీవిని తిరిగి వారి గదిలోనికి మార్పించింది. అది తన తొలివిజయంగా స్వప్న భావించింది.

◆ ◆ ◆

"లావణ్యా! మేం సినిమాకు వెళ్తున్నాం. నువ్వు కూడా వస్తావా?" అన్నాడు గోపాలం.

అప్పటికి స్వప్న సింగారించుకుంది. వేళ అయిపోతున్నట్టు అసహనంగా చూస్తోంది వాచీవైపు.

లావణ్య ముందుగా ఆశ్చర్యపోయింది. "నేను రాలేను అన్నయ్యా! ఎగ్జామ్స్‌కి ప్రిపేరవ్వాలి" అంది.

"పదండి" భర్తను తొందరచేసింది స్వప్న.

"ఏమే వాడు ఆప్యాయంగా పిలిస్తే వెళ్ళనన్నావు?" అన్నపూర్ణ కూతుర్నడిగింది.

"ఆ చుప్పనాతిని చూసినావుగా! ఎలా మొహంపెట్టిందో. 'లావణ్యా! మీ అన్నయ్య రమ్మంటున్నారుగా రా వెళ్ళొద్దాం' అని అందా? అయినా వాళ్ళ మధ్య నేనెందుకు?" అంది లావణ్య.

కొడుకుని కోడలు పూర్తిగా మార్చేసింది అని విచారించింది అన్నపూర్ణ.

◆ ◆ ◆

అన్నపూర్ణకు రెండు రోజుల నుండి ఒంట్లో బాగాలేదు. శ్రీరంగనాయకులు ఆఫీసుకి సెలవుపెట్టి భార్యను డాక్టరుకి చూపించాడు. 'మరేం గాబరా పడవలసిన జబ్బేం కాదు. ఈ మందులు వాడండి. కాస్తా రెస్టు తీసుకోవడం మంచిది' అన్నాడు.

ఆ రోజు లావణ్య కాలేజీకి వెళ్ళలేదు. మర్నాడు తప్పనిసరిగా వెళ్ళాలి. తను లేకపోతే అమ్మ అలాగే పనిచేస్తుంది.

"వదినా! నిన్నటినుంచి అమ్మకు బాగా లేదు. డాక్టరేమో రెస్టు కావాలన్నాడు. నిన్న నేను కాలేజీకి ఎగ్గొట్టాను. కాని ఈ రోజు వెళ్లితీరాలి. నువ్వు శ్రమ అనుకొక వంటాగింటా చూడు."

ఆమె తనను ఆజ్ఞాపించినట్లుగా అనిపించింది స్వప్నకు.

"మా ఇంటిలో వంటచేసే అలవాటు మా అమ్మకు కూడా లేదు. వంట మనిషి ఉంది. అత్తయ్యగారు చేసుకోలేకపోతే ఒక వంటమనిషిని పెట్టుకోవచ్చును కదా?"

లావణ్యకు పౌరుషం వచ్చి ఏదో అనబోయింది. అన్నపూర్ణ కూతుర్ని వారించింది.

"స్వప్నా! మా ఆయనకు కడిగేసిన రాళ్ళలా కటింగులు పోనూ చాలా కొద్ది జీతం వస్తుంది. ఇక అబ్బాయా? మీ పెళ్ళికి ముందు ఆరేదువందలు చేతి ఖర్చుకని వుంచుకుని మిగతాది నా చేతికిచ్చేవాడు. ఇప్పుడు లెక్కపెట్టి రెండువేలు నా చేతిలో పెడుతున్నాడు. మిగతా సొమ్ము వాడు దాచుకుంటున్నాడో నువ్వు దోచుకుంటున్నావో నాకు తెలియదు. మీ నాన్నగారు రెవెన్యూ డిపార్టుమెంటులో పనిచేస్తూ రెండు చేతులా ఆర్జిస్తున్నారు. నౌకర్లూ చాకర్లూ మీ ఇంటినిండా ఉన్నారు. సామాన్య సంసారులం మాకలాంటి అదృష్టం ఏది? అయినా ఇది నా ఇల్లు అని భావించి వుంటే ఇలాగనవు. నీకు పరాయి ఇల్లుగా తోచినంత కాలం మా శక్తి కొలది చేసి పెడతాం" అంది అన్నపూర్ణ.

'నువ్వు దోచుకుంటున్నావు' అని అత్తగారన్న మాట శూలాల్లా గుచ్చుకుంది స్వప్నకు. "నా భర్త సంపాదనను యథేచ్ఛగా ఖర్చుపెట్టుకునే అధికారాన్ని కాదనడానికి మీరెవ్వరు? మా ఖర్చులు మాకు ఉంటాయి. నెలనెలా వారు రెండువేలు ఇస్తూనే ఉన్నారే?" అంది.

అధికారాల గురించి ఆలోచించేవారు బాధ్యతలు కూడా తెలుసుకోవాలి. రెండువేల రూపాయలు ఇస్తున్నారట. లెక్కలు చూసుకునే అంత అని నిర్ణయించుకున్నారా? మీ ఇద్దరికీ రెండు పూటలా భోజనం, కాఫీ, టీలూ ఒక పూట టిఫిన్ అయితే ఆ డబ్బు నిక్షేపంలా సరిపోతుంది. కాని పెద్ద కుటుంబంలోంచి వచ్చిన మా వదినగార్కి భోజనం సదుపాయంగా ఉండాలి. పూటకు రెండు కూరలు, అందులో ఒకటి వేపుడు, పప్పు, పులుసు, పచ్చడి, పెరుగు, అవకాయ, అప్పడాలు, నాలుగురోజులకోమారు స్వీటూ, ఇక మా వదినగారి స్నేహితురాళ్ళకేం కొదవలేదు. ఆవిడగారిని చూసిపోదామని వస్తారు. లంచో డిన్నరో కానిచ్చి వెళ్తారు. ఇక అరగంట అరగంటకూ కూల్‌డ్రింక్ లేదా కాఫీ. వదినా ఇవన్నీ లెక్క వెయ్యి. రెండువేలు ఏ మూలకో తెలుస్తుంది" లావణ్య అంది. అప్పుడే వచ్చిన స్నేహితురాలు సీతతో కాలేజీకి వెళ్ళింది.

ఆ రోజైనా స్వప్న తనకు సహాయపడుతుందని అన్నపూర్ణ భావించింది. ఆమెకేం తెలుసు సత్యభామలా అలకగృహంలో భర్త కోసం నిరీక్షిస్తున్నదని.

పొరుగింటి సుభద్రమ్మగారికి కబురుచేసింది. ఆవిడ స్వప్నను నాలుగు శాపనార్థాలు పెడుతూ కాస్త ఉడకేసి వెళ్ళిపోయింది.

పదిగంటలప్పుడు శ్రీరంగనాయకులు కాస్త ఎంగిలిపడి వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ భార్య కింత హార్లిక్స్ ఇచ్చాడు. పన్నెండుగంటల ప్రాంతంలో ఇంటికొచ్చిన గోపాలం అరగంటవరకు బెడ్‌రూంనుంచి బయటకు రాలేదు. కాలేజీనుంచి వచ్చిన లావణ్యతో 'అన్నయ్యను భోజనానికి రమ్మనవే' అంది అన్నపూర్ణ.

"అమ్మా! రోజురోజుకి ఈ ఇంటిలో గొడవ లెక్కువైపోయాయి. ప్రశాంతంగా ఉండే ఈ ఇల్లు ఇప్పుడు కల్లోలిత సముద్రంలా ఉంది. ఎవరిననాలో ఎవరిననకూడదో తెలియటంలేదు. అది నీ కంటే చిన్నది. సర్దుకు పోరాదా?" అన్నాడు గోపాలం తల్లితో.

"అన్నయ్యగారికి ఇన్నాళ్ళకు జ్ఞానోదయం అయింది. ఏమన్నావూ? ప్రశాంతంగా ఉండే ఈ ఇల్లు ఇప్పుడు కల్లోలిత సముద్రం అయిందనా? అన్నయ్యా ఈ ఇంటిలో మొదట్నించి వుంటున్న మనుషులు అలాగే ఉన్నారు. కొత్తగా వచ్చి చేరినవారు ఎలా మసలుకొంటున్నారో నీకు తెలియనే తెలియదా? సర్దుకుపో అమ్మా అని అంటున్నావు. సర్దుకుపోవడానికి అమ్మ ఎంతగా ప్రయత్నిస్తోందో నీకు తెలుసా? ఆడజన్మ ఎత్తిన తర్వాత వంట చేయను అని భీష్మించి కూర్చుంటే తక్కినవారేనా నౌకర్లు. నీ భార్యను అడుగు ఆమె ప్రవర్తించవలసిన విధానం అదేనా అని."

"ఏమో లావణ్యా! మీరు చెప్పేది ఒకటి, ఆమె చెప్పేది వేరొకటి. ఎవరికి బోధపరచాలో అర్థంకాక చస్తున్నాను."

"అన్నయ్యా! కొత్తగా కాపురానికి వచ్చిన పిల్ల పాలలో పంచదారలా కలిసిపోవాలి. ఎవరికివారు స్థానబలిమినే ఆశిస్తే సర్వసహజమైన మృదుభాషణ, మృదు ప్రవర్తనలను విస్మరిస్తారు అనేది సత్యం. అమ్మ జీవచ్ఛవంలా పడివుండాలా? నువ్వా రెండువేలు మాకివ్వనక్కరలేదు. మీరు స్వయంగా వండుకుంటారో, వంటలక్కను పెట్టుకుంటారో" అంది లావణ్య కోపంగా. ఆ కోపం వెనుక దుఃఖం ఉంది. అది కట్టలు త్రెంచుకు ప్రవహించింది.

గోపాలంకి చెల్లెలిమీద కోపం ముంచుకు వచ్చి కొట్టబోయాడు. అయితే ఆ పని అన్నపూర్ణ చేసి 'నీకెందుకే ఈ ఇంటి గొడవలు, వచ్చే శ్రావణమాసంలో నీ పెళ్ళి ఎలాగూ చేయాలనుకుంటున్నాము. ఈ నాలుగైదు నెలలు నోరుమూసుకు పడివుండు" అంది.

ఆ రాత్రి శ్రీరంగ నాయకులకు సంగతులన్నీ తెలిసాయి. కర్తవ్యం గుర్తుకొచ్చింది. "రేపే నేను పరమేశ్వరరావు దగ్గరకు వెళ్తాను" అన్నాడు.

పదిహేనేళ్ళ క్రితం శ్రీరంగనాయకులు పరమేశ్వరరావు ఇరుగుపొరుగునే వుండేవారు. వారి అబ్బాయికి లావణ్యనివ్వాలని అప్పటినుంచి అనుకుంటున్నదే.

◆ ◆ ◆

"కాయా, పండా?" తిరిగివచ్చిన భర్త నడిగింది అన్నపూర్ణ.

"పక్వానికొచ్చిన కాయ, పండు ఔతుందో కుళ్ళిపోతుందో అది మన అదృష్టం మీద వుంది" అన్నాడు.

అన్నపూర్ణకు విషయం స్పష్టమవ్వలేదు.

"ఎల్లుండి వాళ్ళు వస్తున్నారు అమ్మాయిని చూసుకోవడానికి, కట్నం దాదాపు లక్షవరకు కావాలంటారేమో?"

అన్నపూర్ణ నిబ్బరంగా ఉంది. పిల్లవాడు పిల్లను నచ్చుకోడు అన్న బెంగలేదు. మొదటినుంచి అనుకుంటున్నదే. ఇరుపక్షాలవారు మక్కువ పడుతున్నదే. అయితే లక్షరూపాయలు పెద్ద మొత్తమే. కట్నం ఇతర ఖర్చులకు కనీసం లక్షన్నర కావాలి. ఆనాడు స్వప్న తండ్రి ఇచ్చిన కట్నం అలాగే వుంది. ఒక యాభైవేలు అబ్బాయి ఇస్తాడు. అందులో నుండి అని అనుకుంది.

"ఆ డబ్బు మా నాన్నగారు ఇచ్చినది. నేను రాగిపైసా ఇవ్వను" ఖరాఖండీగా చెప్పింది స్వప్న. గోపాలం నచ్చచెప్పి చూశాడు. మొండివాళ్ళకు చెప్పి ప్రయోజనం లేదు.

"నాన్నా! ఇది మీరు చేసుకున్న స్వయంకృతాపరాధం. ఆనాడు ఆ డబ్బు మా పేర్న బ్యాంకులో వెయ్యమని బ్రతిమాలేమా, బలవంతం చేసామా? ఇప్పుడు గొడవ చేసి మాత్రం ఏం ప్రయోజనం?" అన్నాడు గోపాలరావు.

"అన్నయ్యా! నువ్వేం బాధపడకు. నా జాతకంలో ఎలా రాసి వుంటే అలాగౌతుంది" అంది లావణ్య.

అన్నపూర్ణలో ఓరిమి నశించింది. తాను ఏదేది ఆశిస్తూ వస్తున్నదో వాటికి వ్యతిరేకంగానే జరుగుతున్నాయి. కూతురిపెళ్ళి కట్నందగ్గర ఆగిపోతే ఆ తరువాత ఇలాంటి సంబంధం మరొకటి వస్తుందన్న గ్యారంటీ ఏమిటి?

స్వప్న అన్నా గోపాలం అన్నా ఆమె ద్వేషం పెంచుకోసాగింది. ఒక విధంగా వారిమధ్య పరోక్ష యుద్ధవాతావరణం ఏర్పడింది.

"ఏమండీ! ఇక్కడ వుంటే నాకు పిచ్చెక్కిపోతుంది. మనం వేరౌదాం" అన్నది స్వప్న.

"నా నోటిలో మాట నువ్వు అన్నావు. మనం దూరమైతే మా వాళ్ళైనా సుఖంగా వుంటారు" అన్నాడు గోపాలం.

"అన్నీ తెలిసిన మీరు నింద నా మీదే వేస్తున్నారా?"

"అబ్బే! నీమీద నింద వెయ్యలేదు. దీనికంతటికి బాధ్యుడను నేను."

స్వప్న తన అభిప్రాయాన్ని చెప్పింది.

శ్రీరంగనాయకులకు ఇలాంటి పరిస్థితి వస్తుందని తెలుసు. "కలిసి జీవించడం కష్టమైనప్పుడు విడిపోవడమే మంచిది" అన్నాడు.

"మామయ్యగారు! ఈ ఇల్లు మావారి కాలేజీకి దగ్గర, మీరు పనిచేసే చోటుకి బాగా దూరం. ఇంటినుంచి ఆఫీసుకి వెళ్ళడానికి మీరు రెండు బస్సులు మారాలి. రెండుగంటల సమయం పడుతుంది. మీరు ఆ దగ్గరలో అద్దె ఇంటికి మారిపోండి. ఇంటి అద్దె ఎంతైనా ఫర్వాలేదు. మేం ఇస్తాం" అంది.

లావణ్యకు ఒళ్ళుమండింది.

"ఈ ఇల్లు మీ అబ్బ కట్టించి నీకు రాసి ఇచ్చాడా?"

స్వప్నకు ఆ మాటలు క్రోధాన్ని తెప్పించాయి.

"ఏమిటి లావణ్యా! మరీ అంత చులకనగా మాట్లాడుతావు. అబ్బాదిబ్బా అనడానికి నీకు నోరెలా వచ్చింది."

"అయ్యో! నేనేమి అనరాని మాట అనలేదే అబ్బ అని నేనంటే అంత ఉక్రోషం ఎందుకు. అబ్బ అంటే నాన్న అని అర్థం. అలా మా టీచరు చెప్పారు. నిఘంటువులో చూడు ఆ అర్థం కాక మరో చెడు అర్థం వుంటే నా కలా చెప్పిన మా టీచర్ని చెప్పుతో కొట్టు. అతను సరియైనదే చెప్పాడని నీవు గ్రహిస్తే నీ చెప్పుతో నిన్ను నీవే కొట్టుకో" అంది లావణ్య.

"లావణ్యా! ప్రతీదానికీ రాద్ధాంతమేనా? నిజమే ఈ ఇల్లు నాన్నగారు కష్టార్జితంతో కట్టించుకున్నారు. స్వప్న అందరకూ సదుపాయంగా వుండాలని అలా అంది. మీకు ఇది వదిలి వెళ్ళడం ఇష్టంలేకపోతే మేమే వేరే ఇంటికి పోతాము."

◆ ◆ ◆

గోపాలానికి ఏనాడూ తల్లిదండ్రుల పట్ల చులకన భావం లేదు. అతడు అడకత్తెరలో పోకచెక్క అయ్యాడు. ఇల్లు మారినా రోజూ ఇంటికి వచ్చి తల్లిని పలకరించేవాడు. ఆమె భోజనం పెడితే తినేవాడు.

స్వప్నకు అదీ నచ్చలేదు.

ఇంతలో స్వప్న పుట్టింటికి వెళ్ళవలసి వచ్చింది. "నువ్వు ఆడారివెధవలా ఎలా తయారయ్యావు? నీ పెళ్ళాం నిన్ను తన కొంగుకి కట్టుకు తిరుగుతోంది. ఆడది మగాడి చెప్పుచేతల్లో వుండాలి. చాతకాని సన్యాసివయ్యావు. నా కడుపున చెడబుట్టావు."

స్వప్న ఇంటిలోనికి వెళ్తూ ఈ మాటలు విని ఆశ్చర్యపోయింది. తన తల్లి తన తనయుడికి హితవు చెప్తోంది.

"అత్తగారూ! మీరు కూతుళ్ళకొక విధంగానూ, కొడుకులకొక విధంగానూ పాఠాలు చెప్తున్నారేమిటి? మీ ఆడపిల్లలకు మీరు చెప్పింది చాటుగా విని నేనూ అంతే చేసాను" అంటోంది స్వప్న వదిన.

ఈ మాటలు విన్న స్వప్న సౌధాలు కూలిపోయాయి. ఆ మరునాడే తిరిగి వచ్చి అత్త కాళ్ళమీద పడింది.

కలలలో కట్టిన భవంతులకు పునాదులుండవు. కల చెదిరిపోగానే ఆ భవనం కూలిపోతుంది.

– జాగృతి వారపత్రిక 10 మార్చి, 17 2003